క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

అంబర్‌పేట: సేవాభారతి బీడీఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిదులు శనివారం ఓక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అంబర్‌పేట ప్రధాన రోడ్‌లోని త్రిశూల్ కన్వెన్షన్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. చిన్న పిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్, దంత, గైనకాలజిస్ట్, చర్మ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులు హాజరై వైద్యా పరిక్షలు చేస్తారని అన్నారు.

నేడు కామెడీ షో

కాచిగూడ: కన్నడ నాట్యరంగ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఆదివారం సాయంత్రం 6 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో కామెడీ షో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.కృష్ణమూర్తి, దిడ్డిగి రామచంద్ర, సుమతి తెలిపారు. శనివారం కాచిగూడలోని కర్నాటక సాహిత్య మందిర్‌లో మాట్లాడుతూ కామెడీ క్వీన్ సుధా బర్గూర్, మిమిక్రి మాస్టర్ మహేష్ ప్రదర్శన ఇస్తారన్నారు.

నియామక పత్రం అందజేత



నియమాక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: బీజేపీ గోల్నాక డివిజన్ ఉపాధ్యక్షులుగా వరి కుప్పల హరి, ప్రధాన కార్యదర్శిగా కె. రవీందర్ నియమితులయ్యారు. శనివారం వారి నియమాక పత్రాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ కాంగ్రెస్ టికెట్ బీసీలకే కేటాయించాలి

కాచిగూడ: సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికే కేటాయించాలని సీనియర్ కాంగ్రెస్ నేత కల్లూరి విజయవర్ధన్ నాయుడు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోట నీలిమకు కాంగ్రెస్ టికెట్ వస్తుందంటూ నియోజకవర్గంలో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నల్లకుంట: నల్లకుంట రత్నానగర్, సత్యానగర్‌కు చెందిన పలువురు మహిళలు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సుమారు 300 మంది మహిళలకు గులాబి కండువాలు కప్పిన ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ , అంజమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెడబుడగ జంగాలందరికీ దళిత బంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోరాట సమితి అధ్యక్షులు సిరిగిరి మన్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యా, ఉద్యోగ, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగావెనుకబడిన సంచార జాతులకు చెందిన బెడబుడగ జంగాలంలోని ప్రతి కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని బెడ(బుడగ)జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్యం డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బెడబుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సిరిగిరి మన్యం మాట్లాడారు. బెడ, బుడగ జంగాలకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించి రానున్న ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గగనం మంతప్ప పాల్గొన్నారు.

రైల్లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

కాచిగూడ: రైల్లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... వాడి - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో బాత్‌రూమ్ వద్ద ఓ గుర్తుతెలియని వృద్ధుడు (70) సహజ మరణం పొంది ఉన్నాడు. అనారోగ్య కారణాలతో సరైన ఆహారం దొరకక మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

10వేల మంది ఓటర్లు పెరిగారు

- ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,94,147.
- 103 పోలింగ్ కేంద్రాలు, 274 పోలింగ్ స్టేషన్లు



పురుష ఓటర్లు -	1,51,494.
మహిళా ఓటర్లు -	1,42,641.
ట్రాన్స్‌జెండర్లు -	12
మొత్తం ఓటర్లు -	2,94,147

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య దాదాపుగా ఖరారైంది. నియోజవర్గంలోని 274 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఓటర్ల సంఖ్య 2,94,147 మంది. అందులో పురుషులు 1,51,494 మంది కాగా మహిళా ఓటర్ల సంఖ్య 1,42,641 మంది, ట్రాన్స్ జెండర్లు 12 మంది ఉన్నారు. గతంలో కంటేసుమారు 10 వేల మంది ఓటర్ల సంఖ్య పెరగడం గమనార్హం. ఇంకా నోటిఫికేషన్ వెలువడే వరకు ఆన్‌లైన్‌లో కొత్త ఓటరు నమోదు కోసం ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో ఈ ఓటర్ల సంఖ్యలో చిన్న చిన్న మార్పులు జరిగే అవకాశం ఉంది.

103 పోలింగ్ కేంద్రాలు...

గతంలో నియోజకవర్గంలో 104 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక పోలింగ్ కేంద్రం తగ్గి ఆ సంఖ్య 103కు చేరింది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల్లో పలుమార్లు డీఎంసీ సమావేశాలు నిర్వహించి మార్పులు, చేర్పులు జరిగిన పోలింగ్ కేంద్రాలను నిర్ణయించారు.

మార్పులు జరిగిన పోలింగ్ కేంద్రాలు..

- అడిక్‌మెట్‌లోని జ్యోతి బాలమందిర్ స్కూల్‌లో ఉన్న 256, 257, 262, 263, 264, 265 పోలింగ్ బూత్‌లను పక్కనే ఉన్న ఎస్‌వీఈఎస్ పాఠశాలలోకి, అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్, వడ్డెర బస్తీలోని కోహ్‌గుంత అంఢన్‌వాడీ సెంటర్‌లోకి మార్చారు.
- గాంధీనగర్ డివిజన్‌లోని విద్యాదీప్ హై స్కూల్ పోలింగ్ కేంద్రం అడ్రస్ 1-1-650/22 నుంచి 1-1-650/16కు మారింది. ఈ పాఠశాలలో ఉన్న 38, 39 పోలింగ్ బూత్‌ల చిరునామాలు కూడా మారాయి.
- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఏపీ తెలగ, కాపు, బలిజ సంఘం భవనంలో ఉన్న 63, 64 బూత్‌లను సమీపంలోని రజక కాలనీలో గల జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్‌లోకి మార్చారు.
- కవాడిగూడ డివిజన్ క్రైమ్ బ్రిడ్జ్ గ్రామర్ హైస్కూల్‌లో ఉన్న 72, 73 పోలింగ్ బూత్‌లను పక్కనే ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లోకి మార్చారు.
- దాయర మార్కెట్‌లోని వెస్లీ కేజీ అండ్ ప్రైమరీ స్కూల్‌లో ఉన్న 152, 153, 154, 155, 156 వరకు ఉన్న పోలింగ్ బూత్‌లను సున్నబట్టి దగ్గర గల సెయింట్ లూయిస్ పాఠశాలకు మార్చారు.
- ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని జిల్లా పరిశ్రమల అభివృద్ధి శాఖ ఆవరణలో ఉన్న 168, 169, 170 పోలింగ్ బూత్‌లను ముషీరాబాద్ ఐటీఐలోకి మార్చారు.
- జెమిని కాలనీలోని జిల్లా గ్రంథాలయంలో ఉన్న 175, 176 పోలింగ్ బూత్‌లను హరి నగర్‌లోని రెడ్ కాన్వెంట్ ప్రైమరీ స్కూల్‌లోకి మార్చారు.

ఓటర్ల నమోదుకు ఇంకా అవకాశం ఉంది



కొత్త ఓటర్ల నమోదు నిరంతరంగా కొనసాగుతోంది. 2023 అక్టోబర్ 1తో 18 ఏళ్ల నిండిన వారు గతంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చు. నామినేషన్‌ల దాఖలుకు 10 రోజుల ముందు వరకు ధరఖాస్తు చేసుకుంటే అర్హులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తాము. – తిప్పర్తి యాదయ్య, డీఎంసి జీహెచ్‌ఎంసీ సర్కిల్–15.

పూసల కులాన్ని ఎంబీసీ జాబితాలో చేర్చాలి



దీక్షలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

ముషీరాబాద్: పూసల సామాజిక వర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడి కులాల జాబిత (ఎంబీసీ), కేంద్రంలో డినోటిఫైడ్ ట్రైబ్స్ (డీఎన్‌టి) జాబితాలో చేర్చాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర పూసల సంఘం ఆధ్వర్యంలో పూసల కులాన్ని ఎంబీసీ, డీఎన్‌టీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథులుగా ఈటెల రాజేందర్, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణలో 52 సంచార జాతులు ఉంటే కేవలం 14 కులాలు మాత్రమే సంచార జాతులుగా గుర్తించి, ఆ కులాలను కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలలో పూసల జామాజిక వర్గానికి చెందిన ప్రజలు రకరకాల వేధింపులకు గురవుతూ ఆదిలాబాద్ జిల్లాలో పూసల మహిళలపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేయడం అత్యంత అవమానసీయమైన సంఘటన అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోలాశ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్ గుండ్ల పల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ గౌసుద్దీన్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గంగపుత్ర సంఘం వీధిలో రూ.23 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోలక్‌పూర్ డివిజన్‌లో సుమారు రూ. 22 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్‌ల నిర్మాణ పనులను పూర్తి చేశామని తెలిపారు. పైపులైన్ నిర్మాణం అనంతరం ఆయా ప్రాంతాలలో రోడ్లు సైతం వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కె.ఎం.శంకర్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్‌ది చెరగని ముద్ర'



జమాల్‌బస్తీలో సివరేజ్ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అన్ని వర్గాలకూ అభివృద్ధి ఫలాలను అందిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ జమాల్‌బస్తీలో రూ.18 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సివరేజ్ పైపులైన్ నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఇక్కడి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఒక్కొక్క బస్తీలో దాదాపు కోటి రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణియార్ పట్టి బస్తీలో రూ.18 లక్షలతో సివరేజ్ పైపులైన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష పాల్గొన్నారు.

గోషామహల్ బీఆర్‌ఎస్ టికెట్ మహేందర్ కుమార్‌కు ఇవ్వాలి

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ బీఆర్‌ఎస్ టికెట్ పార్టీ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు ఆర్.వి.మహేందర్ కుమార్‌కు ఇవ్వాలని బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, తెలంగాణ ఉద్యమకారులతో జరిగిన సమావేశం ఏకగ్రీంగా తీర్మానం చేసింది. కాచిగూడలోని శ్రీసాయి కృప హోటల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సమావేశంలో గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. ఉద్యమకారులను పార్టీ అధిష్టానం, సీఎం కేసీఆర్ గుర్తించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులకు సీట్లు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట్ డివిజన్ ఖురాన్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 400 కుట్టు మిషన్‌లను మహిళలకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాను రాను రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుందని ఇది ప్రజలు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజలు ఆకాంక్షలు–పౌర సమాజ కర్తవ్యం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు ప్రజలను సమీకరించి చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అత్యంత ఫాసిస్టు పద్ధతిలో వ్యవహరిస్తుందని విమర్శించారు. తాజాగా న్యూస్ క్లిక్ జర్నలిస్టులను ఉపా పేరుతో అక్రమంగా అరెస్టు చేయడం ఇందుకు పరాకాష్ట అని అన్నారు. గత పదేళ్ల కాలంలో దేశ ప్రజల మధ్య ముఖ్యంగా ముస్లిం ప్రజలకు వ్యతిరేకంగా విద్వేషాలను రెచ్చగొడుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ అంబటి నాగయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ అందించడంలో ప్రభుత్వం విఫలం

చిక్కడపల్లి: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ అపాధ్యక్షులు గుర్రం శంకర్ ఆరోపించారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎల్లయ్య బస్తీలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న పేదలు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసనకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడుతూ బస్తీలో 24 కుటుంబాలు ఉన్నాయని 14 మంది దరఖాస్తు చేసుకున్నా ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూమ్ మంజూరు కాకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మద్దతుదరులకే ఇళ్లను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గుర్రం చంద్రకళ శంకర్, కృష్ణయాదవ్, స్థానికులు ఉమేష్, శంకర్, చంద్రకళ, పద్మ వెంకట్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనవారికి సన్మానం



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, కార్యదర్శి పి.పద్మజ

చిక్కడపల్లి: చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంతో పాటు, శాఖ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు మౌళిక వసతుల పాటు మంచి పుస్తకాలు కల్పించడంతో అనేక మంది కానిస్టేబుల్స్‌గా సెలెక్ట్ కావడం సంతోషకరమని నగర కేంద్ర గ్రంథాలయం చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి అన్నారు. చంపాపేట్ నాగార్జున కాలనీలోని శాఖ గ్రంథాలయంలో చదువుతున్న అభ్యర్థులు 16 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. శనివారం వారిని గ్రంథాలయం చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, గ్రంథాలయం కార్యదర్శి పి.పద్మజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి మాట్లాడుతూ పోటీపరీలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కోసం పోటీ పరీక్షల పుస్తకాలు, వారికి చదువుకోవడానికి ప్రత్యేకంగా వారికి అన్ని వసతులు కల్పించామన్నారు. గ్రంథపాలకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సుద్దాల హన్మంత్ జానకమ్మ జాతీయ పురస్కార బ్రోచర్ ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సుద్దాల హన్మంత్–జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ ప్రజాగాయని అరుణోదయ విమలక్కకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఉద్రిక్తతకు దారి తీసిన చలో సెక్రటేరియేట్



చిన్న పాపతో వచ్చి ఏఎన్‌ఎంను అరెస్టు చేసిన పోలీసులు

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండవ ఏఎన్‌ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన చలో సెక్రెటేరియేట్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌కు చేరుకున్న ఏఎన్‌ఎంల నిరసన కార్యక్రమానికి పోలీసుల అనుమతి లేదంటూ అడుగడుగునా అడ్డుకొని బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు ఆందోళనకారుల మధ్య తోపులాటలో ఓ ఏఎన్ఎం స్పృహతప్పి పడిపోయింది. ఏఎన్‌ఎంల ధర్నాకు అనుమతి లేకపోవడంతో ఇందిరాపార్కు ధర్నా చౌక్ ఇరువైపుల ఉన్న దారులను మూసివేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్



పట్టుబడ్డ చైన్ స్నాచర్‌లు

అంబర్‌పేట: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సిద్దిపేటకు చెందిన జి.అఖిలేష్(23) క్యాబ్ డ్రైవర్, విశాఖపట్నంకు చెందిన రోహిత్ స్నేహితులుగా మారారు. రోహిత్ ఇటీవలే వివాహం చేసుకున్నాడు. కాగా రోహిత్, అఖిలేష్ సులువుగా డబ్బు సంపాదన కోసం చైన్ స్నాచింగ్‌లు చేద్దామని నిర్ణయించుకున్నారు. ఇటీవల గణేష్ నిమజ్జనం సమయంలో అంబర్‌పేట్‌లోని ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. చోరి చేసిన బైక్‌పై రాజేందర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. సమచారం తెలుసుకున్న ఈస్ట్ జోన్ టాస్క్ పోలీస్ పోలీసులు శనివారం వారిని రాజేంద్రనగర్ దేవులపల్లిలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి కేసు విచారణ నిమిత్తం వారిని అంబర్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ మాధవరావు లేన్‌లో రోడ్డు నిర్మాణం పనులు త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆమె జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్‌వర్క్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలసి మాధవరావులేన్ వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదివరకే నూతన సేవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటు పూర్తిచేశామన్నారు. నూతన రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి వహించి పలుమార్లు జోనల్ కమిషనర్‌తో సమీక్షించి ఆయన ఆదేశాలతో నిధులు మంజూరు చేయించామని వివరించారు. కాంట్రాక్టర్లకు అందాల్సిన బిల్లుల విషయంలో ఏర్పడిన సమస్యలే కారణంగా ఇదివరకే మంజూరైన రోడ్లు నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆలస్యం జరిగిందన్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఆనంద్‌రావు, రహమత్‌ఆలీ, సుధాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రులు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవాలయంలో దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని ఆలయ చైర్మన్ బాసాని పద్మాసూర్యప్రకాష్, ఈఓ దేవానాథం తెలిపారు. శనివారం ఆలయం ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు.

పాదయాత్రకు తరలిన ఎంఎస్‌ఎఫ్ నాయకులు



బస్సును ప్రారంభిస్తున్న కొమ్ము శేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ: శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పాస్ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆలంపూర్ నుంచి చేపట్టిన పాదయాత్రలో పాల్గొనేందుకు ఎంఎస్‌ఎఫ్ నాయకులు ఓయూ నుంచి తరలివెళ్లారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎంఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ బస్సుకు జెండాఊపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టి మాదిగ, మాదిగల ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరన్న, ఉపేందర్, నర్సయ్య, శ్రీనివాస్, శివకుమార్, నాగేందర్, మండ్ల రవి, బాలునాయక్ పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: శ్రీ కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులకు పురస్కారప్రదానం త్యాగరాయగానసభ కళా సుబ్బారావు కళావేదికలో శనివారం రాత్రి జరిగింది. తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు భూదాన్ సుబ్బారావు, నేషనల్ మెమోరియల్ తెలంగాణ ప్రతినిధి పామర్తి పద్మావతిలకు జీవిత సాఫల్య పురస్కారాలను రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరావు ప్రదానం చేశారు. నిర్వాహకులు భారతీ కమలాకర్, ఆచార్య గౌరీశంకర్, కోదాటి రంగారావు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం



గాంధీఆస్పత్రి: ప్రభుత్వ నర్సింగ్ పోస్టుల ఉన్నతీకరణపై జీవో విడుదల చేయడం పట్ల గాంధీ ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గాంధీ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత కొన్నేళ్లుగా తాము చేస్తున్న డిమాండ్‌ను ఆమోదిస్తూ తెలంగాణ ప్రభుత్వం నర్సింగ్ సిబ్బంది హోదాలను మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్రకుమార్, ఆర్ఎంఓ జయకృష్ణ, ఎల్ఆర్ఎంఓ పద్మ, డాక్టర్ రమేష్, వెంకటరమణ, చీఫ్ నర్సింగ్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు మంగమ్మ, మేరీ రోజలిన్, తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.